అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 28 జూన్ 2023

మైసమ్మ దావతులపై ఆంక్షలు ఉపసంహరించుకోవాలి

నస్పూర్: అన్ని ఏరియాలకు భిన్నంగా కేవలం శ్రీరాంపూర్ ఏరియాలోని అధికారులు అత్యుత్సాహంతో కార్మికుల మైసమ్మ దావత్ కార్యక్రమాలను నిషేధిస్తూ ఏరియా యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూగర్భంలో చేసిన కష్టాన్ని మర్చిపోవడానికి కార్మికులు చేసుకునే దావత్‌లకు దూరం చేస్తూ సర్క్యులర్ ఇవ్వడం సరికాదన్నారు. అధికారులైతే గెస్ట్‌హౌస్‌లు, సీఈఆర్ క్లబ్‌లలో పార్టీలు చేసుకుంటున్నారని, మరి కార్మికులు ఎక్కడ చేసుకోవాలో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గనులు మొదలైనప్పట్నుండి మైసమ్మ దావతులు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.గుర్తింపు సంఘం యాజమాన్యానికి అనుకూలంగా ఉండడం వల్లనే ఇలాంటి కార్మిక వ్యతిరేక సర్క్యులర్లు వస్తున్నాయని తెలిపారు. యాజమాన్యం ఎన్నికలు నిర్వహించమని చెప్పినందున అన్ని యూనియన్లను కార్మిక సమస్యలపై ఆహ్వానించి చర్చిస్తే ఇలాంటి సర్క్యులర్లు రాకుండా అడ్డుకోవడంలో ముందుంటామన్నారు. ఈ సర్క్యులర్‌ను రద్దు చేసి పారిశ్రామిక శాంతిని కాపాడాలని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు

జైపూర్ : మండల పరిధిలో గల నర్వ, వెంకట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీలు కలిసి తహసీల్దార్‌ను కలిశారు. గ్రామ పంచాయతీల పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టడం కోసం ప్రభుత్వ పరంగా స్థలాన్ని సమకూర్చాలని కోరారు. రూ.20లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఈజీఎస్ నుండి విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిపాలనా సౌలభ్యం కోసం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నిధులు మంజూరు కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు.



ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

నవతెలంగాణ-జైపూర్



నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు సంతోష్(27) మంగళవారం తెల్లవారు జామున హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో వోల్వో డ్రైవర్‌గా పని చేస్తున్న సంతోష్ కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మూర్ఛ వ్యాధి కారణంగా పెండ్లి సంబంధాలు రాకపోవడంతో మనస్థాపం చెంది 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రాలు దానం

ఆత్మహత్యకు పాల్పడిన రైతు సంతోష్ నేత్రాలను ఇంటర్నేషనల్ ఐ బ్యాంకుకు దానం చేసినట్లు మృతుని తల్లిదండ్రులు రైతు మొండమ్మ-పాపయ్య తెలిపారు. కుమారుని నేత్రాలు ఇతరుల ద్వారా ఈ ప్రపంచాన్ని ఇంకా చూడాలన్న సంకల్పంతో దానం చేసినట్లు వారు తెలిపారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



నవతెలంగాణ - బెజ్జూర్

బెజ్జూర్ గ్రామానికి చెందిన నానబోయిన తారక్క కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. మంగళవారం మహారాష్ట్రలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సలు నిర్వహించగా ఆమెకు కాలేయం, కిడ్నీలపై ఇన్ఫెక్షన్ వచ్చిందని, సుమారు రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుందని కుటుంబీకులు తెలిపారు. ఇంత మొత్తం ఆమె వద్ద లేకపోవడంతో దాతలను చేతులు జోడించి ప్రార్థించి ఆర్థిక సాయం అందించాలని బాధితురాలు కోరారు. దాతలు 6300005645, 6303154617 గూగుల్ పే, ఫోన్ పేకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

మంగళవారం కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్ నరసింహారావును ఇటీవల పదవీ విరమణ పొందిన సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, బెల్లంపల్లి రీజినల్ జీఎం సేఫ్టీ కెహెచ్‌ఎన్ గుప్తా గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా సింగరేణి సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ పురోగతిలో నరసింహారావు చేసిన కృషి అమోఘమని కొనియాడారు. నరసింహారావు తన అనుభవాలను అధికారులకు క్లుప్తంగా వివరించారు. అన్ని విభాగాల అధిపతులు శాలువాలతో సన్మానించి మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్‌అండ్‌ఎ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహార, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీవైపీఎం రెడ్డిమల తిరుపతి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలి



నవతెలంగాణ-జైపూర్

విపరీతమైన అనర్థాలకు కారణమవుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని జైపూర్ ఎస్టీపీపీ డీవైజీఎం వాసుదేవ మూర్తి సూచించారు. మంగళవారం కానుకూరు గ్రామాన్ని సందర్శించిన ఆయన సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్‌తో కలిసి ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్ వాడకుండా ఉండటం మంచిదని సూచించారు. పూర్వం మాదిరిగా బట్ట సంచులు, పాత్రలు వాడటం శ్రేయస్కరమని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-నార్నూర్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా గాదిగూడ మండలంలో రెండో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలో రెండో విడత సామాజిక తనిఖీ 2020 నవంబర్ 1వ తేదీ నుండి 31 మార్చి 2022 వరకు మండలంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించి, తుది నివేదికను సమర్పించుటకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావేదికకు స్థానిక ప్రజాప్రతినిధులు కూలీలు హాజరై ప్రజా వేదికను విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఐక్య గురుకులాల జిల్లా కన్వీనర్ సుద్దాల వినోద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు పని భారం అధికంగా ఉన్నందున వారికి పేస్కేలు మంజూరు చేయాలన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు టీచర్లకు 12 నెలల వేతనాలు చెల్లించాలని, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ప్రత్యేకంగా పాఠశాలలో కేర్ టేకర్లను, డిప్యూటీ వార్డెన్‌ను నియమించాలన్నారు. సమస్యల పరిష్కారానికి టీఎస్‌యుటిఎఫ్ పోరాటానికి సిద్ధంగా ఉందని, గతంలో సమయపాలనలో మార్పు, పీఆర్సీ సాధించుకోవడంలో టీఎస్‌యుటిఎఫ్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నిరసన కార్యక్రమంలో చంద్రయ్య, సంధ్య, శ్యాం, సంతోష్, రమేష్, లింగయ్య, మారుతి, గజానంద్, మహేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురుకులాల ఉపాధ్యాయులు నిరసనకు దిగారు. ఐక్య గురుకులాల జిల్లా నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26, 27న అన్ని గురుకుల పాఠశాలల్లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు పని భారం అధికంగా ఉన్నందున వారికి స్కేల్ మంజూరు చేయాలన్నారు. గెస్ట్ పార్ట్‌టైం, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు టీచర్లకు 12 నెలల వేతనాలు చెల్లించాలని, వారికి పేస్కేల్ అమలు చేయాలని, సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మమత, రేణుక, అశ్విన్, జయలక్ష్మి, శ్రీజ పాల్గొన్నారు.

జైనూర్ : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురుకుల సమస్యల పరిష్కారానికి నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మొహబ్బత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు పని భారం అధికంగా ఉన్నందున వారికి పేస్కేల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరంజన్, మహేందర్ పాల్గొన్నారు.





పోడు భూములకు పట్టాలు చారిత్రాత్మకం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు



నవతెలంగాణ-జైనూర్

పోడు భూములకు పట్టాలివ్వడం చారిత్రక నిర్ణయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. మంగళవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసులు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న పోడు భూములకు పట్టాల కల నెరవేరుతున్నందున సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధించిన నాటి నుండి నేటి వరకు ఆదివాసుల కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జోడేఘాట్‌కు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు గోండు గూడాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించారని తెలిపారు. ఆంధ్రపాలనలో ఆదివాసులను నాటి ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. నాడు ఇంద్రవెల్లిలో భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించడానికి నిర్బంధం ఉండేదని, స్వరాష్ట్రంలో స్వేచ్ఛగా నివాళు లర్పిస్తున్నారన్నారు. గుస్సాడీ, దండారీ ఉత్సవాలకు రూ.10 లక్షలు, పరందోళి పుణ్యక్షేత్రం జాతర దర్బార్‌కు ప్రతియేటా రూ.10 లక్షలు అందిస్తున్నారన్నారు. ఈ నెల 30న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, భీం విగ్రహావిష్కరణతో పాటు మాజీ మంత్రి కొట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. సీఎం బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చేలా చూడాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, వైస్ చైర్మన్ ఆత్రం ప్రకాష్, సర్పంచ్‌లు నాగోరావు, భూపతి, వీణాబాయి, జాలింషా, పార్టీ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు పాల్గొన్నారు.

సీఎం చెప్పిన లాభాలను వెంటనే కార్మికులకు పంచాలి



నవతెలంగాణ-మందమర్రి

సీఎం చెప్పిన లాభాలను వెంటనే కార్మికులకు పంచాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కెకె-5 గనిలో పిట్ సెక్రటరీ సంకె వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. మంచిర్యాలలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ సంస్థకు వచ్చిన లాభాల్లోంచి రూ.700 కోట్లను కార్మికులకు పంపిణీ చేస్తామని చెప్పారన్నారు. విద్యాసంస్థలు తెరుచుకునే సమయంలో కార్మిక కుటుంబాలకు ఆర్థిక అవసరాలుంటాయని, కంపెనీ ఆర్థిక పరిస్థితి కూడా బాగుందని యాజమాన్యం చెబుతున్నందున వెంటనే కార్మికులకు లాభాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వాయిదా పడినందున ఇప్పటికైనా అన్ని యూనియన్లతో మైన్స్ సేఫ్టీ స్ట్రక్చర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి కార్మిక సమస్యలను పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కోలిండియాలోని వాటాలు అమ్ముతుంటే సిఐటియుగా లేఖ రాసి వ్యతిరేకించామని, మిగిలిన యూనియన్లు స్పందించలేదని తెలిపారు. బొగ్గు రంగాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా మళ్లీ వేలం పాటలో తెలంగాణకు సంబంధించిన గనులను పెట్టినందున అందరూ వ్యతిరేకించాలన్నారు. అన్ని ఏరియాలలో క్వార్టర్ లేని కార్మికులకు ఇంటి కిరాయి చెల్లిస్తున్నా కేవలం మందమర్రిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల యాజమాన్య అనుకూల వైఖరి వల్లనే కార్మికులకు నష్టం చేస్తున్నారన్నారు. గనిపై టిఫిన్ బాక్సులు, బూట్లు, పర్సు లాంటి సామాగ్రి భద్రపరచుకునేందుకు సేఫ్టీ లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఎస్ఆర్ నిధులను తెలంగాణ అభివృద్ధిలో భాగంగా ఖర్చు పెడుతున్న యాజమాన్యం కార్మికుల క్వార్టర్లు, రోడ్లు, కాలువలు వంటి వాటిపై కూడా ఖర్చు చేసి బాగు చేయించాలని కోరారు. సమస్యలపై కార్మికులందరికీ అవగాహన కల్పించి చైతన్యపర్చడం సిఐటియు లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్‌స్వామి, మల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, అలవల సంజీవ్, ఆర్గనైజర్లు భేతి భరత్, శ్రీనివాస్, శ్రీధర్, వడ్లకొండ శివ, చైతన్యరెడ్డి, కల్వల శ్రీనివాస్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ ఎంఎంసీ చెక్కులను అందజేసిన జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

20 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంఎంసీ(మంత్లీ మానెటరీ కం పెన్షన్) చెక్కును మృతి చెందిన ఉద్యోగి భార్యకు బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అందజేశారు. గోలేటి(1)ఎలో విధులు నిర్వర్తించే ఉద్యోగి గాండ్ల మల్లయ్య 1998లో మృతి చెందాడు. దీంతో అతని భార్య తమ కుమారుడికి ఉద్యోగం కావాలని దరఖాస్తు చేసుకున్నారు. మరోసారి ఉద్యోగం కాకుండా ఎంఎంసీ కోసం దరఖాస్తు చేయడంతో ఇప్పటివరకు వారికి ఎలాంటి లబ్ధి జరగలేదు. డైరెక్టర్, ప్రాజెక్టు బలరాం పెండింగ్‌లో కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ప్రత్యేక చొరవ తీసుకున్న జీఎం పాత జాబితాపై ప్రత్యేక దృష్టి సారించారు. గాండ్ల లక్ష్మికి రూ.29.35 లక్షల ఎంఎంసీ చెక్కును అందజేశారు. ఇప్పటికే 20ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించి రూ.12.50లక్షలను ఉద్యోగుల కుటుంబీకులకు అందించామన్నారు. కొన్ని రోజుల క్రితం కరోనాతో మృతి చెందిన కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబీకులకు వారం రోజుల్లో రూ.15 లక్షల చెక్కును అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ కెహెచ్‌ఎన్ గుప్తా, ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ ఆర్ సతీష్‌బాబు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహార, డీజీఎం ఎఫ్‌అండ్‌ఎ రామారావు, డీవైపీఎం రెడ్డిమల తిరుపతి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ప్రశ్నిస్తే జైల్లో వేస్తారా..?

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళల నిరసన



నవతెలంగాణ-భీమారం

బెల్ట్ షాపులపై ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి జైల్లో పెట్టడం ప్రభుత్వానికి తగదని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం నిరసనకు దిగారు. నియోజకవర్గంలో అడ్డగోలుగా వెలిసిన బెల్ట్ షాపులను ఎత్తివేయాలని పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ల రాధికపై అక్రమ కేసు బనాయించి 14 రోజులు రిమాండ్‌కు పంపడం ఎంత వరకు సమంజసమని మహిళలు ప్రశ్నించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఆవుడం ఎక్స్‌రోడ్డు వద్ద మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన తెలిపారు. మూడు రోజుల క్రితం బడి గుడి అనే తేడా లేకుండా వెలిసిన మద్యం బెల్ట్ షాపులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ ఆమె పోరాటానికి దిగి విషయం తెలిసిందే. మహిళల సమస్యలపై పోరాటం చేస్తున్న వారిపై ఇలా అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వానికి తగదని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపుల వల్ల మద్యానికి బానిసైన కుటుంబాల్లో మహిళలు ఆర్థికంగా చితికిపోయి, పిల్లలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితుల్లో ఆ కుటుంబాల ఉసురుపోసుకోవడంపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. వెంటనే రాధిక పై అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించుకొని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బురదమయమైన రోడ్లతో రాకపోకలకు ఇబ్బందులు



నవతెలంగాణ - వాంకిడి

నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి రోడ్డు పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో రోడ్డంతా బురదమయంగా మారింది. వాహనదారులు వెళ్లలేని పరిస్థితిలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఎటూ వెళ్లాలన్నా పూర్తిగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచి ఉండడంతో ఎక్కడ గుంతలున్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలినడకన కూడా ఈ రోడ్డు గుండా వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అనేకసార్లు నాలుగు వరుసల రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆందోళనలు చేసినా రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా ఇప్పటివరకు కూడా రోడ్డు పనులు కాకపోవడంతో చొప్పన్‌గూడ, ఆర్లి, ఖానాపూర్‌కు వెళ్లే ప్రజలకు రోడ్డు దాటడం చాలా కష్టంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనాథ పిల్లలకు మాలీ సంక్షేమ సంఘం అండ



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని ముత్యంపేట గ్రామంలో తల్లి, తండ్రిని కోల్పోయి అనాథులుగా మారిన ముగ్గురు పిల్లలకు మంగళవారం మాలీ సంక్షేమ సంఘం నాయకులు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం పెద్దన్న కార్యదర్శి ఆదె వసంత్‌రావు, మాలీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు ఆదె నాందేవ్, సర్పంచ్ ఆదె శ్రీనివాస్, మోర్లె పాండురంగ్, అరెల్లి సంజయ్, ఆదె నారాయణ, ఆదె వసంత్, లెండుగురె శంకర్, లేండుగురె శ్యాంరావ్, వివిధ గ్రామాల గ్రామ పటేళ్లు, యువకులు పాల్గొన్నారు.

ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉచిత సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ పరీక్షలు శిక్షణ కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై రెండవ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందిని ఎంపిక చేయడానికి జూలై 9వ తేదీన హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 2లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుద్ఘాతానికి గురై మేక మృత్యువాత

నవతెలంగాణ-తాంసి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుద్ఘాతానికి గురై మేక మృత్యువాత పడ్డ సంఘటన మండలంలో కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ముందర ఉన్న రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. రోడ్డుపై నుంచి మేక మేయడానికి వెళ్తుండగా జి.రాజుకు చెందిన మేక విద్యుద్ఘాతానికి గురై మృత్యువాత పడింది. విషయం పశువైద్యాధికారికి తెలియజేయడంలో పశువైద్యదికారి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మేక విలువ రూ15వేలు ఉంటుందని మేక యజమాని తెలిపారు. విద్యుత్ సంస్థ నష్టపరిహారం అందించాలని కోరారు.

ఇందిరమ్మ కాలనీలో గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు డిక్లరేషన్, నిరుద్యోగ డిక్లరేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీలో నాయకులు విస్తృతంగా పర్యటించారు. పేదవారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవరెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వైస్ చైర్మెన్ జహిర్ రంజాని అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగను పురస్కరించుకోని మసీదు అధ్యక్షులకు, ఇమామ్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వ్యర్థాలను సేకరించేందుకు ప్లాస్టిక్ కవర్లను కాలనీల వారిగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా ప్రతి ఒక్కరూ పండుగ రోజు వ్యర్థాలను బయట పడవేకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలని అన్నారు. వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్ లలోనే వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పక్కవారికి ఇబ్బంది కలగకుండా పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, అశోక్, సైదురావు, కోఆప్షన్ సభ్యులు ఎజాజ్, మసీదు కమిటీల అధ్యక్షులు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు మనుబోతు అప్పగింత

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ తండ గ్రామ శివారులో కుక్కల దాడిలో గాయాలపాలైన మనుబోతును సోమవారం రాత్రి ఎడ్‌బిడ్ తండాకు వచ్చింది. దీనిని గమనించిన గ్రామ యువకులు, సర్పంచ్ జాదవ్ ధూమ్‌నాయక్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వెటర్నరీ డాక్టర్ రాజేశ్వర్ మనుబోతునకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం గ్రామస్థులు మనుబోతును ముథోల్ ఎస్సై సాయికిరణ్, ఫారెస్ట్ ఆఫీసర్ మహేశ్వర్‌లకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం మనుబోతును అటవీ అధికారులకు అప్పంగించారు. అటవీశాఖ అధికారులు మనుబోతును అటవీప్రాంతంలో వదిలి పెడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అర్జున్, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో విద్యార్థులు పాల్గొనాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో విద్యార్థులు ఎక్కువ మొత్తంలో పాల్గొనాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఐటీఐ కళాశాలలో పర్యటించి, విద్యార్థులకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ గురించి అవగాహన కల్పించారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ జూలై 1న, పరీక్షా నిర్వహణ తేది జూలై 2న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కోసం వెబ్‌సైట్ రాజీవ్‌గాంధీయూత్‌క్విజ్.కాంను సంప్రదించాలని సూచించారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రజలు సీఎం బహిరంగ సభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్, సీనియర్ నాయకులు యూనుస్ అక్భాని, పార్టీ మండల అధ్యక్షుడు పూసం బాదిరావ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేళ భక్తులకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. గురుపౌర్ణమి సందర్భంగా జూలై 3న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపాలని టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నిర్ణయించింది. ఆసక్తిగల భక్తులు తమ ఊరికి దగ్గరలో ఉన్న డిపోలో సంప్రదించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం సంబంధిత డిపో మేనేజర్‌లను సంప్రదించాలని తెలిపారు. ఆదిలాబాద్ 9959226002, నిర్మల్ 9959226003, మంచిర్యాల 9959226004 నెంబర్లను సంప్రదించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

చెరువులో చేపలు మృతి



నవతెలంగాణ-దస్తురాబాద్

చెరువులోని చేపలు అధిక సంఖ్యలో మృతి చెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. విషయం తెలుసుకున్న మత్స్యకారులు చెరువు వద్దకు వెళ్లి చేపలను పరిశీలించి ఆవేదనను వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతోనే అధిక సంఖ్యలో చేపలు మృతి చెందినట్టు మత్స్యకారులు అనుమానం వ్యక్తం చేశారు. సుమారుగా రూ.5 నుంచి 10 లక్షల వరకు నష్టం జరిగినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి, మృత్యువాత పడిన తీరుపై విచారణ జరిపి కారకులైన వారిపై చట్టం రీత్యా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

ఓటరు జాబితాలో
తమ పేరు, చిరునామా సరి చూసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా సరి చూసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్లు లేని వారు ఫాం 6 ద్వారా మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. ఓటరు నమోదు, సమగ్ర ఓటరు జాబితాను తయారు చేయడం జరిగిందన్నారు. అగస్టు 31వ తేది వరకు అభ్యంతరాల స్వీకరిస్తున్నామని, 21సెప్టెంబర్ నాటికి డ్రాఫ్ పబ్లికేషన్ చేయడం జరుగుతుందన్నారు. తుది జాబితను అక్టోబర్ 4న ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈక్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో కూడా తెలుసుకోవాలని సూచించారు. నామినేషన్ చివరి తేది నుంచి పది రోజుల ముందు వరకు తన పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నటరాజన్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, ఆయా పార్టీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ వెబ్‌లో మొబైల్ వివరాలు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

సెంట్రల్ ఇంక్యూమెంట్ ఐడెంటి రిజిస్టర్ వెబ్‌లో తమ మొబైల్ నెంబర్ వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇటీవల మొబైల్ ఫోన్లు పొగుట్టుకున్నవారికి తమ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫోన్ పోయిన లేదా దొంగలించబడిన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి ఈ వెబ్ సైట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేసుకున్నట్లైతే అలాంటి మొబైల్స్‌ను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈ పోర్టల్ నిర్వహణకు సంబంధించి అన్ని పోలీస్ స్టేషన్ల నందు పోలీసు అధికారులను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ పోర్టల్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. చాలా మంది వినియోగదారులు వారి పోయిన మొబైల్స్ వివరాలను ఈ రిపోర్ట్ వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందని అన్నారు. వినియోగదారులు నమోదు చేసుకున్న వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు పోగొట్టుకున్న, చోరికి గురైన 10 మొబైల్స్‌ను రికవరీ చేయడం జరిగిందనీ తెలిపారు. వినియోగదారులు ఎవరైనా మొబైల్స్ పోగొట్టుకున్న, వారి మొబైల్ చోరీకి గురైన వెంటనే సంబంధిత వివరాల్లో ఐఎంఈఐ, మొబైల్ నెంబర్, బిల్, మీసేవా రశీదు, పోలీస్ స్టేషన్, మండలం, జిల్లా, రాష్ట్రం, పిన్ కోడ్ మొదలగు వివరాలతో ఈ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని అన్నారు. ఇలా నమోదు చేయడం వల్ల ఫోన్ బ్లాక్ చేయబడి ఫోన్ పని చేయదన్నారు. ఇందులో ఎవరైనా సిమ్ కార్డ్ వేసుకుంటే ట్రేస్‌ఎబిలిటి రిపోర్ట్ వస్తుందని, దీని ఆధారంగా పోయిన మొబైల్ లోకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకోవచ్చున్నారు. పోయిన సెల్ ఫోన్‌లను అశ్రద్ధ చేస్తే ఫోన్‌లో ఉన్న వ్యక్తి గత సమాచారం, ఆధారాలు దొంగిలించి నష్టాన్ని కలగజేస్తాయని తెలిపారు. ఇది వ్యక్తి గత భద్రతకు, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందని తెలిపారు. దొంగిలించిన ఫోన్‌లతో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఈ వెబ్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరైనా మొబైల్స్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ నూతన అప్లికేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. బాగా పని చేసిన సిబ్బంది అందరికీ సర్వీస్ రివార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్., నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు అజయ్‌బాబు, రవీందర్, ఐటి కోర్ ఇన్‌చార్జ్ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జులై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్ : అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూలై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమవుతుందని దీనికి పూర్తి సహకారం తమ తరఫున అందిస్తామని జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ముందస్తుగా బాల కార్మికుల రక్షణ పై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ ఆపరేషన్ ముస్కాన్ పకడ్బందీగా నిర్వహించి, దొరికినటువంటి పిల్లలను వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారి తల్లిదండ్రులకు అప్పజెప్పి వారిని స్కూల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా పిల్లల్లో పనిలో పెట్టుకున్న ప్రతి ఒక్కరిపై తగు చర్యలు తీసుకోవాలని లేబర్ డిపార్ట్‌మెంట్ వారిని అలాగే పోలీస్ డిపార్ట్‌మెంట్ వారిని ఆదేశించారు. ఈ సందర్భంగా డీసీపీఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో జరిగిన విధంగానే ఈ సంవత్సరం కూడా ఆపరేషన్ ముస్కాన్ పకడ్బందీగా చేపడతామని తెలియజేశారు. అలాగే అటువంటి పిల్లలకు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ రావ్ మాట్లాడుతూ తాము పని చేస్తున్నటువంటి ఐదు మండలాలలో అక్కడున్నటువంటి మండల స్థాయి ఆఫీసర్లతో మండల్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి, పిల్లలకు రక్షణ కల్పించే విధంగా పనిచేస్తున్నామని అన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో కూడా ఆపరేషన్ స్మైల్ ముస్కాన్ కార్యక్రమాలు ఇచ్చినట్లయితే వారికి అడిషనల్ సపోర్ట్‌గా మా పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని అన్నారు. మండల స్థాయి కార్యక్రమాలను కూడా మనం నిర్వహించుకోవాలని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌లో దొరికినటువంటి పిల్లలకు ఎటువంటి వైద్య సదుపాయం అవసరం ఉన్నట్లయితే తమ సిబ్బంది ద్వారా వారికి వెంటనే వైద్యం అందించే విధంగా చూస్తామన్నారు. 24 గంటల్లో ఏ సమయంలో ఫోన్ చేసినా ఆ సమయానికి తాము రెస్పాన్స్ ఇచ్చి పిల్లల రక్షణ కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, జగదీశ్ రెడ్డి, జి.వినోద్, ఏటీడీఓ సౌజన్య, చైల్డ్ లైన్ 1098 టీం, మహిత స్వచ్ఛంద ప్రోగ్రాం సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఫినో బ్యాంక్ సేవలు

- మొబైల్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభిస్తున్న సౌత్‌హెడ్ హిమాన్షు మిశ్రా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫినో బ్యాంక్ మొబైల్ సేవలను విస్తరించనున్నట్లు ఆ బ్యాంక్ సౌత్ హెడ్ హిమాన్షు మిశ్రా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో మొబైల్ బ్యాంక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 రోజుల్లో కార్యకలాపాలు, ఆర్థిక పరిజ్ఞానం సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 27 నుంచి ఆగస్టు 29 వరకు రాష్ట్రంలోని 3వేల గ్రామాలకు ఈ సేవలు అందించనున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న వారికి బ్యాంకింగ్ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని, వారందరికి ఆర్థిక ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 20వేల బ్యాంకింగ్ పాయింట్లు ఉన్నాయని అన్నారు. ఖాతాలతో పాటు ఆధార్‌తో గ్రామస్తులకు సులభంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ఆధార్, పాన్‌కార్డు అప్లికేషన్, అప్‌డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. డబ్బులు బదిలీ చేయడం, బిల్లులు చెల్లించడం, రీచార్జీలు, ఏటీఎం సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ హెడ్ ఇనాయత్, క్లస్టర్ హెడ్ విశాల్ రెడ్డి, ఖుద్దూస్, అంకిత్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని కాలనీలు : బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణంలోని కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు కాలనీ ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. కాలనీల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా నాయకులు ముకుంద్‌రావు, దశరథ్, రత్నాకర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- శిబిరాన్ని ప్రారంభించిన ఆర్ఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రక్తదానం కంటే గొప్పదానం ఏది లేదని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీ రెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనలు మేరకు మంగళవారం బస్సు డిపో కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం స్వయంగా రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, సిబ్బంది, యువకులు, స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను అనుభినందించారు. సుమారుగా 30 మంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ పుల్లయ్య డిపో మేనేజర్ కల్పన, అసిస్టెంట్ మేనేజర్ మెకానిక్ రాజేందర్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ విశ్వనాథ్, ఆఫీస్ సూపరింటెండెంట్ విలాస్, అకౌంటెంట్ మోహన్, ఆర్టీసీ డిస్పెన్సరీ డాక్టర్ భూమయ్య పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



నవతెలంగాణ-కడెం

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడెం మండలంలోని చిట్యాల గోండు గూడలో ప్రకృతి సేద్యంపై కూరగాయల సాగుపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ జి.సందీప్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్.మౌనిక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంగా కూరగాయలు పండించే గిరిజన రైతులకు, విత్తనాలను, జీవన ఎరువులను, జిగురు అట్టలను, వేప నూనె లాంటి వాటిని ఫ్రీగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే నచ్చన్‌ఎల్లాపూర్ గోండుగూడెం, కొలంగూడెంలో కూడా గిరిజన రైతులకు ప్రకృతి సేద్యంలో కూరగాయల పెంపకం, మల్టీపుల్ క్రాపింగ్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సర్పంచ్, ఎంపీటీసీ, ఏఈఓ శాలిని, రిలయన్స్ ఫౌండేషన్ కడెం మండల ఆఫీసర్ సంధ్య, రైతుబంధు కోఆర్డినేటర్, ప్రజలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులతో టీడీపీ సమావేశం



నవతెలంగాణ-అదిలాబాద్ టౌన్

టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లమెంట్ అధ్యక్షులుగా గుళ్లపల్లి ఆనంద్, పార్లమెంట్ కమిటీ కార్యవర్గాన్ని 22 మందితో కలిపి ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ పార్లమెంట్‌లోని 6 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను సైతం ప్రకటించారు. సిర్పూర్ గుళ్లపల్లి ఆనంద్, ఆసిఫాబాద్ పెరుగు ఆత్మరాం, ఖానాపూర్ పవర్ దేవిదాస్, ఆదిలాబాద్ అల్లూరి రాజారెడ్డి, బోథ్ ఆత్రం జ్ఞానసుద, ముథోల్ బోయిడి విఠల్‌లను నియామకాలు చేశారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం తహసీల్దార్ లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలతో మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం మండలంలోని ప్రాథమిక పాఠశాలలోని పిల్లలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట వేణుతో కలిసి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మతోట రాజమణి శివయ్య, ఎంపీఓ అనిల్ కుమార్, ఎస్ఓ తిరుమల, సిబ్బంది పాల్గొన్నారు.

'మైసమ్మ వేడుకలకు నిషేధం లేదు'

నవతెలంగాణ-నస్పూర్

కార్మికులు గనులపైన చేసుకునే మైసమ్మ వేడుకలకు ఎలాంటి నిషేధం విధించలేదని మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న గనులలో డిపార్ట్‌మెంట్‌లలో కొందరు ఉద్యోగులు మద్యం, మత్తు పానీయాలు సేవించడం జరుగుతున్నట్లుగా అధికారుల దృష్టికి వచ్చిందని, మైన్స్ రూల్స్ 1955 ప్రకారం గనులలో, డిపార్ట్‌మెంట్‌లలో ఎటువంటి మద్యం, మత్తు పానీయాలు సేవించకూడదని చట్టం ఉన్నందున ఆదేశాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. దీనిని కొందరు అపార్థం చేసుకుని మైసమ్మ వేడుకలు చేసుకోవడంపై నిషేధం విధించినట్లుగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ఉద్దేశించినది కాదని, ఉద్యోగ సోదరులు, నాయకులు గమనించాలని కోరారు.

ఒప్పంద ఉద్యోగ నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ నందు ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగ నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషలిస్ట్ ఇన్ ఫినాన్షియల్ లిటరసీ పోస్టుకు ఆర్థిక, బ్యాంకింగ్, తత్సమాన రంగాలలో డిగ్రీ, పీజీ అర్హత గల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రభుత్వ, ప్రభుత్వ ఇతర సంస్థలలో పనిచేసే కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని, వయసు 35 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. అర్హత గల మహిళ, పురుష అభ్యర్థులు ఈ నెల 28 నుండి జూలై 7వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా కార్యాలయ పనివేళల్లో జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి జాతీయ ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హనుమంతరావు విజేతలకు బహుమలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి అని, విద్యార్థులు ఆర్థిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్థిక మోసాల పట్ల జాగ్రత్త వహించాలని, విద్యార్థులు ఇరుగూ పొరుగు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పోటీకి మండలంలోని 7 ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు భావన, అక్షిత ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా, కేజీబీవీ ఆసిఫాబాద్ విద్యార్థులు గంగా భవాని, అక్షయ రెండవ స్థానంలో, జడ్పీఎస్ఎస్ జన్కాపూర్ విద్యార్థులు సిద్దేశ్వర్, సచిన్ మూడవ స్థానంలో నిలిచారు. విజేతలకు ఆర్‌బీఐ ద్వారా నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని దీనిలో భాగంగా ప్రథమ బహుమతి రూ. ఐదు వేలు, ద్వితీయ బహుమతి రూ.నాలుగు వేలు, తృతీయ బహుమతి రూ.మూడు వేల అందజేస్తారని ఎల్‌డీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారి సంజీవ్, వివిధ పాఠశాలల గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక విద్య అనే అంశంపై మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. బాదంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మొదటి బహుమతి రూ.5,000లు, రెండవ బహుమతిగా చింతగుడా పాఠశాల రూ.4,000లు, మూడవ బహుమతి రూ.3,000లు తపాలపూర్ పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్టు ఎంఈఓ ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీఐ మేనేజర్ వెంకట్, ప్రధానోపాధ్యాయులు జనార్దన్, రాజేందర్, కమలాకర్, తిరుపతి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(పాత)లో విద్యార్థులకు మంగళవారం 'ఆల్ ఇండియా- క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిట్రసీ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను కాగజ్‌నగర్ ఎస్బీఐ బ్రాంచి మేనేజర్ అశోక్ కుమార్ అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆర్థిక వ్యవస్థపై అవగాహన కోసమే దేశవ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహించామన్నారు. బ్యాంకుల పని తీరు ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల విద్యార్థులకు 'పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ ప్రాముఖ్యత' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేకనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సుందర్‌రావు పాల్గొని విద్యార్థులకు స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ ఒక గొప్ప కార్యమని, స్వచ్ఛమైన భారత దేశ నిర్మాణంలో స్వచ్ఛత పరిశుభ్రత ముఖ్య భూమిక పోషిస్తుందని, మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నట్లయితే మన ఆరోగ్యం కూడా బాగుంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ గృహాలను అదేవిధంగా మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని సర్వాయిపేట గ్రామంలో మంగళవారం సంత్ సేవాలాల్ గుడి విగ్రహ ప్రతిష్ఠాపన సద్గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు. అందుకే సంత్ సేవాలాల్ ఇతర కులాలవారికి కూడా ఆదర్శంగా నిలిచారన్నారు. సేవాలాల్ ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి, జాతి జాగృతి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసునూటి వసంతకుమారి, లంబాడ నాయకులు రవి నాయక్, దేశీ నాయక్, సమ్మయ్య నాయక్, బాపు నాయక్, బన్సీ నాయక్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు

ఆర్టీసీ రక్తదాన శిబిరానికి స్పందన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో డిపో మేనేజర్ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. శిబిరానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా వైద్యాధికారి రామకృష్ణ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదాతలు ప్రాణాలను కాపాడిన వారవుతారని అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. రక్తదాన శిబిరంలో భాగంగా డిఎం శ్రీధర్ తో పాటు మరో 15 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది పండ్లు, జ్యూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, ఎస్టీఐ సరియా, ఏఎంఎఫ్ ఉదయ్, టీఐ3 భారతి, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-జన్నారం

గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గట్టు మహేష్‌ని మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ కోలతార పద్మారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా అందించే రెండో విడత గొర్రెల పంపిణీ త్వరగా యాదవులకు అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసాల నరేష్, రవి, ముంజంపల్లి సాయికుమార్, స్వరి శ్రావణ్, తిరుపతి, మహేష్, అంకం మహేష, మల్లేష్, భాస్కర్, అఖిల్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజమౌళి పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

శాంతియుత వాతావరణంలో పండగలు నిర్వహించుకోవాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు.మంచిర్యాల జిల్లా మందమర్రి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్, తొలి ఏకాదశి, బోనాల జాతర పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడానికి ముస్లిం, హిందూ మత పెద్దలకు సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. బక్రీద్ సందర్భంగా గోవధ చేయవద్దని, ప్రభుత్వం గోవధ నిషేధించడం జరిగిందని తెలిపారు. గోవధ చేసే వారిపై, గోవులను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగను నిర్వహించుకోవాలని, అన్ని కులాల మతాల పండుగ పర్వదినాలను శాంతియుతంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, మత సామరస్యం గురించి ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. బక్రీద్, తొలి ఏకాదశి, బోనాల జాతర పండుగలలో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో మత ఘర్షణల ప్రేరేపిత వార్త ఏదైనా వస్తే నమ్మవద్దని తెలిపారు. పుకార్లను సృష్టించి ఎవరైనా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్కిల్ ఎస్సైలు చంద్రకుమార్, అశోక్, ఆంజనేయులు, గంగారాం, మత పెద్దలు పాల్గొన్నారు.



జన్నారం : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని జన్నారం ఎస్సై పీ.సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ, మతాలకు చెందిన పెద్దలతో రాజకీయ పార్టీ నాయకులతో ప్రజా ప్రతినిధులతో పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండను జరుపుకోవాలని కోరారు. స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, కోఆప్షన్ సభ్యుడు మున్వార్ అలీ ఖాన్, కాసెట్టి లక్ష్మణ్, ఎంపీటీసీలు కొంతం శంకరయ్య, దర్శనాల వెంకటస్వామి, ఎంపీటీసీల ఫోరం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పసియుల్లా, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, శంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-హాజీపూర్

ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ హాస్టల్స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ కాంట్రాక్టు వర్కర్స్ 3 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. పీఫ్, ఈఎస్ఐ, రూ.10 లక్షల ప్రమాద భీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ ఏడాది టెండర్ ఏ ఏజెన్సీకి వచ్చిన ప్రతి నెల వేతనాలు రెగ్యులర్‌గా చెల్లించాలన్నారు. కొన్ని రోజుల క్రితం కొంత మంది హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసిన వారికి మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంట్రాక్టు విధానాన్ని తొలగించి అందరిని రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, సుజాత హాస్టల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ప్రేమలత, కల్పలత, జిల్లా ఉపాధ్యక్షురాలు అంజలి, హేమలత, సూర్య లక్ష్మి, జనార్దన్ పాల్గొన్నారు.

రూ.100 పెరిగిన టమాట

నవతెలంగాణ-మందమర్రి

టమాటా పచ్చి మిర్చి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాట రూ.100కి విక్రయిస్తున్నారు. ఒక్క రోజులోనే రూ.20 పెరిగి మంగళవారం రూ.100 దాటింది. సాధారణంగా టమాటా కిలో 20 నుంచి రూ.40 వరకు విక్రయిస్తారు. గత వారం రూ.50 ఉన్న ధర ప్రస్తుతం రూ.100కు చేరింది. రూ.40 నుంచి రూ.60 లభించే పచ్చి మిర్చి ధరలు ఇప్పుడు ఏకంగా రూ.120 చేరుకున్నాయి. నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగడం తో సామాన్య మధ్యతరగతి ప్రజలకి ఇబ్బందిగా మారింది. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అన్నట్టుగా పరిస్థితి తయారైందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వారం రోజుల్లోనే అమాంతంగా పెరిగిన ధరలు

మార్కెట్‌లో డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి దిగుబడి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. స్థానికంగా పంటలు లేకపోవడం ఒక కారణమయితే మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల వడగళ్ళ వర్షాలు మరో కారణం. అకాల వర్షాలతో టమాట మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. టమాటా, మిర్చి పంటలు కొత్తవి వేశారు. కానీ అవి మళ్ళీ కోత దశకు వచ్చి మార్కెట్ రావడానికి కొంత సమయం పడుతుందని అప్పటివరకు సమస్య తప్పదని వ్యాపార నిపుణులు, రైతులు చెప్తున్నారు. ఏది ఏమైనా ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి ప్రజలకి శాపంగా మారింది. కిలో కొనేవాళ్ళు అరకిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రెండు కిడ్నీలు పనిచేయక సాయం కోసం ఎదురుచూపు

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని గుడిపేట్ ఎస్సీ కాలనికి చెందిన మామిళ్ల బుచ్చయ్య దినసరి కూలి రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యం పాలయ్యాడు. మంచిర్యాల జిల్లా ఆసుపత్రికి వెళ్తే రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయని డాక్టర్లు తెలిపారు. అక్కడే వారం రోజులుగా చికిత్స అందించిన అనంతరం డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చేతిలో చిల్లి గవ్వ లేక ఆస్పత్రిలోనే బిక్కు బిక్కు మంటూ ఉండడం గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు తలా ఇంత జమచేసి మంగళవారం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. ఆస్పత్రి చేతి ఖర్చులు, తినడానికి తిండి లేక బార్య, ఇద్దరూ పిల్లలు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్తిలో ఉన్న బుచ్చయ్యకు వ్యాధి సోకటంతో కుటుంబం దిక్కుతోచని స్తితిలో ఉంది. దాతలు ఎవరైనా ముందుకు వస్తారని ఎదురుచూస్తున్నారు. సహాయం అందించాలనుకునే వారు 9100240885 నెంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం చేయగలరని వేడుకుంటున్నారు.

వన్యప్రాణిని చంపిన వ్యక్తికి 15 రోజుల రిమాండ్



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని చింతగూడ బీట్‌లో అడవి వన్య ప్రాణి బెంగాల్ మానిటర్(ఉడుము)ను హతమార్చిన వ్యక్తికి 15 రోజుల రిమాండ్ విధిస్తూ లక్షెట్టిపేట జడ్జి తీర్పు ఇచ్చినట్లు చింతగూడ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు. చింతగూడకి చెందిన పానుగంటి శీను అనే వ్యక్తి ఉడుమును హతమారస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి లక్షెట్టిపేట జడ్జి ముందు ప్రవేశపెట్టామన్నారు. మంగళవారం శీనుకు 15 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ శ్రీనివాస్ అటవీ అధికారులు పాల్గొన్నారు.

'గిరిజన విద్యార్థికి అండగా ఉంటా'



నవతెలంగాణ-దహెగాం

ఎంబీబీఎస్ సీటు సాధించిన గిరిజన విద్యార్థి సంగర్ప్ స్రవంతికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో గల విద్యార్థి ఇంటికెళ్లి సన్మానించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలావార్ తెగ నుండి మొట్టమొదటి ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని స్రవంతిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వైద్య విద్య అభ్యాసంలో తనవంతుగా సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు రోశన్, వెంకటేశ్, దామోధర్ పాల్గొన్నారు.

సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీవైఎస్ఈ (సివిల్)జయప్రకాష్ సివిల్ కార్మికులతో కలిసి పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం జయప్రకాష్ మాట్లాడుతూ కార్మిక ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ పరిసరాలను కార్యాలయ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినట్లయితే ఎటువంటి వ్యాధులకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపీ, డీవైఎస్ఈ(సివిల్) శ్రీధర్, జేఈ (సివిల్) దేవి కుమార్, సీనియర్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీనివాస్, ఓవర్ సీర్ సామ్రాట్, సబ్ ఓవర్ సీర్ వెంకటస్వామి, శానిటరీ జమిదార్ సదానందం పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 28 జూన్ 2023

ఇంటింటికీ బీజేపీ

నవతెలంగాణ-తలమడుగు

ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల రత్నాకర్‌రెడ్డితో పాటు బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీజేపీ తొమ్మిదేండ్ల పాలనపై వివరించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వాటి అమలు తీరుపై ప్రజలకు తెలియజేశారు. అందులో భాగంగానే మండలంలోని ఉండం, సుంకిడి, లింగి, తలమడుగు గ్రామాలలో ఇంటింటికీ తిరిగి బీజేపీ తొమ్మిదేండ్ల పాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి స్వామి, కిరణ్, ధనంజయ్, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రభాస్, రవి, కైలాస్, నవీన్, అశోక్, వన్నెల లక్ష్మణ్, శశికాంత్ యాదవ్, నరేందర్, ప్రవీణ్, ఉశన్న పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు గిరిజన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఇంటర్మీడియట్ పాస్ అయిన గిరిజన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ దివ్యరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29 నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని జూలై 8న చివరి గడువని తెలిపారు. పదో తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. కళాశాలలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజడ్సీ, ఎంబిజెడ్సి, బీకాం(సిఏ) బీఏ(హెచ్ఈపి) గ్రూపులు అందుబాటులో ఉన్నాయని మొదటి ప్రాధాన్యత గిరిజన మహిళలకు ఇవ్వడం జరుగుతుందని, టీజీ యూజీసీ సెట్ రాసిన వారికి ప్రాధాన్యత ఇస్తూ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఉంటుందని పేర్కొన్నారు.

దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో టీఎమ్మార్పీఎస్, మాల మహానాడు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ మాట్లాడుతూ ఇటీవల ఇంద్రవెల్లి మండలంలో ఆదివాసీ గిరిజన మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. తక్షణమే జిల్లా ఎస్పీ స్పందించి దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షపడే విధంగా చూడాలని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దళిత, గిరిజన మహిళలకు తగిన రక్షణ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి సంపర్ల అడెల్లు, తోటి గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మర్సకోల బాపూరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్న కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొల్లూరి స్వామి, అద్దంకి శ్రీనివాస్, దుర్గం దుర్గయ్య ఉన్నారు.

ప్రసంగాన్ని వీక్షించిన డాక్టర్ పాల్వాయి

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోడీ 9 సంవత్సరాల పాలనపై మెరాబూత్ సప్తె మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా బోపాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మోడీ ప్రసంగాన్ని మండల కార్యకర్తలతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసంగాన్ని వినడంతో పాటు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, సీనియర్ నాయకులు పుప్పాల సత్యనారాయణ, వడాల సురేష్, సంజీవ్, శ్రీనివాస్, తిరుపతి, మధుకర్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నూతన సీఐ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన జవ్వాజి సురేష్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కే.సురేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతన సీఐని పలు సంఘాల నాయకులు శాలువాతో సన్మానించారు.

శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

నాగర్ కర్నూల్‌లో రజక వృత్తిదారుల నాయకుడు శ్రీనివాస్‌పై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగళ్ళపల్లి వెంకటేష్, పాయిరాల రాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొంతకాలంగా రజక వృత్తిదారుల కుటుంబంపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ వారి భూమిని అక్రమించాలని చూస్తున్నటువంటి ఈ దాడిని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకూడదని వెంటనే రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దాడికి పాల్పడ్డ వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయకపోతే అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మేరా బూత్ సబ్సే మజ్ బూత్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మేరా బూత్ సబ్సే మజ్ బూత్ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు అశోక్ కుమార్, తాలూకా కన్వీనర్ వీరభద్ర చారి జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, భూత్ అధ్యక్షుడు బుషగిరి శ్రీనివాస్, సభ్యులు జాడి మధుకర్, అనిల్, మాంధాత సుదర్శన్, తాటి వెంకటేష్, రమేష్, రాజయ్య శ్రీనివాస్, గురు దాస్, బూత్ అధ్యక్షుడు మహేశ్వరచారి పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

నవతెలంగాణ-కౌటాల

అన్ని రంగాల అభివృద్ధే తెలంగాణ సీఎం కేసీఆర్ లక్ష్యమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని అన్నారు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గంలోని అన్ని మండలాలు అభివృద్ధి చెందాయని అన్నారు. కొత్త మండలాల ఏర్పాటు, గిరిజన గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ నెల 30న ఆసిఫాబాద్‌కు వస్తున్న సీఎం కేసీఆర్‌కు మనమంతా ఘన స్వాగతం పలకడానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. సీఎం సభలో మన నియోజకవర్గానికి శుభవార్త వింటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కుమురం మాంతయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు బ్రహ్మయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యూత్ మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని విధాల సిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదామును ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ ప్రాథమిక స్థాయి పరిశీలనలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈవీఎం గోదాము సీసీ కెమెరా పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో జిల్లా జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు ప్రేమల గార్డెన్ వద్ద నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. వర్షం కురుస్తుండగా బహిరంగ సభా స్థలం బురదమయంగా మారడంతో దాన్ని సిద్ధం చేయడం ఎలాగని నాయకులు చర్చించుకుంటున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులతో సమావేశం నిర్వహించారు. సభ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, మండలంలోని సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



పోలీసుల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం జిల్లా కేంద్రానికి బుధవారం నాటికి పోలీసు బలగాలు చేరుకోనున్న నేపథ్యంలో వారికి విడది కోసం జిల్లా కేంద్రంలోని ఎస్ఎం, రోజ్ గార్డెన్లతో పాటు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. వాంకిడి, కెరమెరి వైపు నుండి వచ్చే వాహనదారుల పార్కింగ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పిలు శ్రీనివాస్, కరుణాకర్, సిఐలు రాణా ప్రతాప్, సురేష్, రమేష్, నాగరాజ్, సాదిక్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలి

- నోడల్ అధికారి జితేంద్ర
- ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



జైనథ్

నవతెలంగాణ-జైనథ్

ప్రతి ఒక్కరూ ఆర్థిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలని నోడల్ అధికారి జితేంద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆర్థిక లావాదేవీలపై క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ముఖ్యఅథిగా హజరై క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకి ఆర్బీఐ ద్వారా అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు జూలై 4న ఆదిలాబాద్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించబడతాయని అన్నారు. విద్యార్థి దశ నుండి ఆర్థిక లావాదేవీలు తెలుసుకోవాలని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యను వదలకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు మద్ది లస్మన్న, ఉపాధ్యాయులు రమేష్, విఠల్, వెంకటి, దువాస సుభాష్ పాల్గొన్నారు.

తాంసి : ఆర్బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్ మంగళవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన వివిధ పాఠశాలల, విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి సాయి తేజ, జగదీష్ సెకండరీ పాఠశాల భీంపూర్ నుండి. ద్వితీయ బహుమతి మనీషా, హర్షిత జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కప్పర్ల నుండి అదేవిధంగా మూడో బహుమతి నవనీత్, వంశీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల గోట్కూరి నుండి విజేతలుగా నిలిచారు. ఈ క్విజ్ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి శ్రీకాంత్, బ్యాంకు మేనేజర్ రవి యాదవ్, క్విజ్ మాస్టర్‌గా నెమలికొండ శ్రీనివాస్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుజన రూ.5వేలు ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు విద్యార్థులకు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ముథోల్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, ఎస్బీఐ ముధోల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండల స్థాయి టాలెంట్ టెస్టులో మండలంలోని 13 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గాయత్రి, వినాయక్‌లు మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. వీరికి ముథోల్ ఎస్బీఐ శాఖ మేనేజర్ ఎస్ఎస్ గిరి నగదు బహుమతి రూ. 5వేలతో పాటు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు : ఆల్ ఇండియా లెవెల్ క్విజ్ కాంపిటీషన్ ఫైనాన్స్ లిటరసీ ఫర్ స్కూల్ చిల్డ్రన్ ఈ క్విజ్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఆర్బీఐ సౌజన్యంతో బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్విజ్ ప్రోగ్రాంలో జెడ్పీఎస్ఎస్ కజ్జర్ల మొదటి స్థానంలో, కుచులాపూర్ విద్యార్థులు రెండవ స్థానంలో, దేవాపూర్ విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. మొదటి స్థానంలో వచ్చిన వారికి రూ.5వేలు, రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ.4వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.3వేలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ, ప్రధానోపాధ్యాయులు వినోద్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి కూడాల రవీందర్‌రెడ్డి, మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మహేందర్ యాదవ్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాంసి



తలమడుగు

గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూలై 1న నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గ్రూప్ ఫోర్త్ పరీక్షల నిర్వహణపై సూపరింటెండెంట్లు, లైజెనింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లుతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జులై 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పేపర్-1 మధ్యాహ్నం 2:30 నుంచి 5.00 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేకాధికారులను నియమించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు, రైటింగ్ పాడ్స్ అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని అన్నారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా ఆయా రూట్లలో తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ వారికి సూచించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, ఓఆర్ఎస్ పాకెట్లతో ఏఎన్ఎమ్‌ను, ఆశా వర్కర్‌ను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఆయా అధికారులందరూ సమన్వయంతో పని చేసి గ్రూప్-4 పరీక్ష సజావుగా నిర్వహించాలని కోరారు. అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్‌లను ఇచ్చే సమయంలో అభ్యర్థులకు బబ్లింగ్ విధానంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-ఉట్నూర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మంగళవారం మండలంలోని పులిమడుగులో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడకు చెందిన మోహన్ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఉట్నూర్‌కి వస్తున్నాడు. మండలంలోని పులిమడుగు గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద రాగానే అడవి పంది అడ్డుగా వచ్చింది. పందిని ఢీకొని అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు పోలీసులకు, 108కి సమాచారం అందించారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలందించి, మెరుగైన చికిత్స కోసం వైద్యులు రిమ్స్‌కు రెఫర్ చేశారు.

ప్రవేశాల అలాట్మెంట్ లెటర్లను అందజేసిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలు స్థానిక సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రవేశాల కొరకు కౌన్సెలింగ్ నిర్వహించి, అలాట్మెంట్ లెటర్లను విద్యార్థులకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ బొగ్గు ఉత్పత్తితో పాటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ఉన్నత విద్యను అందించాలనే దృక్పథంతో సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీని శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పాలిటెక్నిక్ కాలేజి అత్యుత్తమ ర్యాంకులో ఉందని తెలిపారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు వివిధ కంపెనీలలో అత్యున్నత హోదాలలో ఉద్యోగాలు చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పాలిటెక్నిక్ కాలేజీలో అధునాతన లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడా ప్రాంగణం ఉన్నాయని, ఈ కాలేజీలో సీటు దొరకడం చాలా అదృష్టమని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటూ పైకి రావాలని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో ఇన్చార్జి కరస్పాండెంట్ ప్రకాష్‌రావు, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ (ఎస్బిటీఈటీ) ఎం. దేవేందర్, అడ్మిషన్ ఇన్చార్జ్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ప్రధాని మోడీ ప్రసంగాన్ని వీక్షించిన జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మధ్యప్రదేశ్ భూపాల్‌లో ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన మేరా బూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి జ్యోతిరెడ్డి, నాయకులు ఆదినాథ్, వేణుగోపాల్, జోగు రవి, దినేష్ మాటోలియా, పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - బెజ్జూర్

ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జిల్లాకు వస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. మంగళవారం బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండల కేంద్రంలోని రైతువేదికలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనకు భారీ జన సమీకరణ చేయాలని పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. ప్రతి ఇంటింటికెళ్లి జనాన్ని సమీకరించి సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి, అగర్‌గూడ గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే కోనప్ప సమక్షంలో పార్టీలో చేరగా బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, సహకార సంఘం చైర్మన్ ఓం ప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, మాజీ చైర్మన్ డోకె వెంకన్న, అధ్యక్షుడు సకారాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : 30న జిల్లా కేంద్రంలో సీఎం బహిరంగ సభకు ఇంటింటికెళ్లి ప్రతి ఒక్కరిని ఆహ్వానించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పోడు భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమం సిర్పూర్ నియోజకవర్గం నుండే చేస్తున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా చూడాలని తెలిపారు. మండలంలోని కొండపెల్లి, అగర్‌గూడ, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్‌లు సంజీవ్, రాజన్న, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

